క్లుప్తంగా

ఉగాది పంచాంగం ఆవిష్కరణ



కల్వకుర్తిరూరల్: లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో తెలుగు సంవత్సరం ఉగాది సందర్భంగా ముద్రించిన నూతన పంచాంగాన్ని బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేశ్ బాబు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రామకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేసి పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ పంచాంగాలను వేదపండితులకు అందజేశారు. వేదపండింతులు పట్టణంలోని వాసవి దేవాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయం, హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలే లయన్స్ క్లబ్ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్, కిషన్, రమేశ్, జగదీశ్వర్, జి శ్రీనివాస్, శేఖర్, శ్రీధర్, రమణ, అశోక్ పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు సన్మానం

కల్వకుర్తిరూరల్: మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా ఎంపికైన గంగాధర్‌చారిని బహుజన సమాజ్‌పార్టీ దక్షిణ తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ యాదవ్ బుధవారం ఘనంగా సన్మానించారు. సీనియర్ నాయకుడు గంగాధర్ సేవలను గుర్తించి మార్కెట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లేశ్ యాదవ్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కల్వకుర్తిరూరల్: తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణ మందిరంలో యాదవ హక్కుల పోరాట సమితి నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేశ్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శంకర్ యాదవ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. యాదవులకు 40 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, మహేశ్, మల్లేశ్, సైదులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి నిర్వహణకు విరాళాలు

తాడూరు: మండల కేంద్రంలో ఈనెల 29న నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు బుధవారం గ్రామస్తులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విరాళాల సేకరణ చేపట్టారు. గ్రామానికి చెందిన సర్పంచ్ యాదమ్మ రూ.10వేలు, ఎంపీటీసీ రేణుకా మల్లయ్య రూ.5వేలు, బీఆర్ఎస్ మండల పార్టీ ప్రెసిడెంట్ యార రమేశ్ రూ.5 వేలు, మరికొంత మంది గ్రామస్తులు విరాళాలు అందజేశారు. గ్రామస్తుల సహాయ సహకారంతో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పూజారులు వెంకటేశ్వర శర్మ, శంకరయ్య, పవన్‌కుమార్ తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో బుధవారం ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని రావేప్ విద్యార్థులు అవగాహన కల్పించారు. జాతీయ సేవా శిబిరంలో భాగంగా సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో యువతకు పాత చీరలతో డోర్‌మాట్ ఏర్పాటు, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, రావేప్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా వీక్షించిన మాజీ మంత్రి

కొల్లాపూర్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం తన అనుచరులతో కలిసి బలగం చిత్రాన్ని తిలకించారు. ఉదయం తన కార్యాలయంలో ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనుచరులకు ఉగాది పచ్చడి పంచిపెట్టారు. రామాపురం వెళ్లే దారిలో సోమశిల హిల్స్ వెంచర్‌కు ఎదురుగా జూపల్లి కృష్ణారావు తన సొంత ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో బలగం చిత్రాన్ని వీక్షించారు. ఆయన వెంట కౌన్సిలర్ రహీంపాషా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హన్మంతునాయక్, నాయకులు నర్సింహ, కేతూరి ధర్మతేజ, ఎక్బాల్, అన్వర్, బాబా, వేణుగోపాల్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ ఉన్నారు.



బల్మూర్‌లో దేవాలయంలో పంచాగం పఠనంలో గ్రామస్తులు



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో..



అచ్చంపేట శ్రీభ్రమరాంబ ఆలయంలో పంచాంగ శ్రవణం..



వాహనానికి పూజలు చేయించుకుంటున్న భక్తులు

ఆలయాలు కిటకిట

- శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పూజలు
- పురోహితులు, వేద పండితుల మధ్య పంచాంగ శ్రవణం

ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా భక్తులు ఆలయాలకు చేరుకుని తమ ఇష్ట దైవాలను దర్శించుకున్నారు. బుధవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. సాయంత్రానికి పంచాంగ శ్రవణం విన్నారు. జిల్లా కేంద్రంతోపాటు బిజినేపల్లి, కొల్లాపూర్, తెలకపల్లి, వెల్దండ, తాడూరు, చారకొండ, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, ఉప్పునుంతల, బల్మూర్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు భక్షాలు, పులిహోర వడ్డించారు. ఉగాది పండుగ ప్రత్యేకతను చాటే షడ్రుచుల పచ్చడిని వివిధ ఆలయాల్లో పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో పంచాంగకర్తలు పంచాంగ శ్రవణం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



చారకొండలో పంచాంగ శ్రవణానికి హాజరైన ప్రజలు



అచ్చంపేటలో పూజలు చేస్తున్న భక్తులు



పెద్దకొత్తపల్లిలో పంచాంగ శ్రవణం



బలాన్‌పల్లిలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పూజారి



తాడూరులో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



అచ్చంపేటలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



తెలకపల్లి మండలం గౌరారంలో



కొల్లాపూర్ రామాలయంలో..



బిజినేపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు

ఏపీఎం కృష్ణయ్యను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సాయన్న మాదిగ

కల్వకుర్తిరూరల్: దళిత ఉద్యోగి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సాయన్న మాదిగ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో వారు మాట్లాడారు. వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన కృష్ణయ్య ఆమన్‌గల్ మండలంలో డీఆర్‌డీఏలో ఏపీఎంగా పనిచేస్తున్నారన్నారు. ఈనెల 10న విధులు ముగించుకుని కల్వకుర్తికి తిరిగి వస్తుండగా వెల్దండ సమీపంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్య ప్రస్తుతం హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వారు అన్నారు. ఆయన చికిత్సకు దాదాపు రూ.20 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు తెలిపారు. కృష్ణయ్యను రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు పరామర్శించడంతో పాటు ప్రమాదానికి దారితీసిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించినట్లు వారు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడికి చికిత్సకు డబ్బులు లేక మిత్రులు, గ్రామస్తులు, ఉద్యోగులు దాదాపు రూ. 3 లక్షల వరకు విరాళం అందజేశారన్నారు. కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఇప్పటికీ బాధితుడిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బాధిత కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలని సాయన్న సుధాకర్ కోరారు. కార్యక్రమంలో మల్లేశ్, చిన్నా, రామస్వామి, రామరాజు, విష్ణు, నగేశ్ ఉన్నారు.

బలియం హెగ్డేవార్‌కు ఘన నివాళి

మన్ననూర్: స్వయం సేవక్ సంఘ్ యుగ పురుషుడు బలిరాం హెగ్డేవార్ జయంతిని విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆయనను స్మరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్ నాయకులు మాట్లాడుతూ సమాజ క్షేమం కోసం ఆయన ప్రతిక్షణం ఆరాటపడుతూ ఆరని జ్యోతిలా వెలిగేవాడని అన్నారు. సమాజ సేవకే అంకితమైన మహోన్నతుడని కొనియాడారు. అనంతరం గ్రామ ప్రజలు, చిన్నారులకు షడ్రుచుల గురించి వివరిస్తూ పచ్చడి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, శివకుమార్, రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం




కవితలు చెబుతున్న శీనయ్య గౌడ్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ మేరకు పలువురు కవులు ఉగాది విశిష్టతను వివరిస్తూ కవితలను ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మనోహర్ కవులకు మెమోంటోలు బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో కవులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కల్వకుర్తిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహ ధారుడ్యం లభిస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కల్వకుర్తి ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. నేటి ఓటమిని రేపటి విజయానికి పునాదిగా చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, విజయ్‌గౌడ్, శ్రీధర్, నగేశ్, జహీర్, హరికృష్ణ శర్మ పాల్గొన్నారు.



క్రీడాకారులతో గోలి శ్రీనివాస్‌రెడ్డి

పోతులూరి నాటక ప్రదర్శన

చారకొండ: మండలంలోని జూపల్లిలో కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శనను ఉగాది పండగ సందర్భంగా మంగళవారం రాత్రి ప్రారంభించారు. నాటకం మూడు రాత్రులు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ వేషధారణతో పలువురు నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో నాటక బృందం సభ్యులు లింగయ్య గౌడ్, చంద్రయ్య గౌడ్, కొండల్, లక్ష్మయ్య, రవి, వెంకటయ్య, రాములు, తదితరులు ఉన్నారు.



నాటక ప్రదర్శనలో బృందం సభ్యులు

ఆలయ నిర్మాణానికి రూ.96వేల ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని ఈదమ్మబండతండాలో నూతనంగా నిర్మిస్తున్న మహాకాళి దేవాలయ నిర్మాణానికి బుధవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.96వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ పేదలకు అండగా ఉంటుందన్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి లక్ష్యంగా పేదలకు సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల్లో నిర్మించుకున్న దేవాలయాల పూర్తి చేసేందుకు ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలునాయక్, నాయకులు మణిపాల్, బాన్య, అంజ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.


మల్లన్న ఆచూకీ వెల్లడించాలి

అచ్చంపేట: రెండు రోజుల క్రితం తీన్మార్ మల్లన్నతోపాటు క్యూ ఆఫీస్‌పై దాడిచేసి పోలీసులు తీసుకెళ్లారని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న తీసుకొచ్చే బాధ్యత పోలీసులు, ప్రభుత్వంపై ఉందన్నారు. తీన్మార్ మల్లన్న ఆచూకీ వెల్లడించాలని అన్నారు.

భక్తిభావంతో మెలగాలి

వెల్దండ: మండల పరిధిలోని గాన్‌గట్టుతండాలో బుధవారం బాలాజీ ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ప్రజలందరూ భక్తిభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంజినాయక్, శ్రీనివాసులు, ఉపసర్పంచ్‌లు మారుతి, నర్సింహముదిరాజ్, నాయకులు రమేష్ నాయక్, గణేష్, గిరి, శ్రీను, మైసయ్య, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీదితండాలో ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం గిరిజనుల ఆరాధ్యదైవం ముత్యాలమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు సాగే ఈ ఉత్సవాలలో మొదటిరోజు ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాలను శుద్ధి చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల వంటకాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, యువకులు డప్పుల దరువుకు నృత్యాలు చేసి సంతోషాన్ని పంచుకున్నారు. రాత్రివేళ భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో గిరిజన నాయకులు సక్రూనాయక్, రెడ్యానాయక్, జగ్నా, పూల్యానాయక్, గోవిందు, బాలు, చంద్రు, నాగరాజు, చందులాల్, కిషన్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్‌గా ఛత్రునాయక్

అచ్చంపేట రూరల్: యూత్ కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్‌గా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి సర్పంచ్ ఛత్రునాయక్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ రూపేష్ నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో నియమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులపై అక్రమంగా కేసు పెడితే వారి తరుపున పని చేసి న్యాయం కోసం పోరాడుతానని తెలిపారు. ఛత్రునాయక్ నియామకం పట్ల పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ జ్యోత్స్న గుంటి తన జన్మదిన వేడుకలను పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో బుధవారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఆమె దుప్పట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. అనాథ వృద్ధులను ఆశ్రమాల్లో చేర్పిస్తే తప్పు లేదని, కుటుంబం ఉన్నవారు కూడా వృద్ధులను ఆశ్రమాల్లో చేర్పించడం బాధకరమన్నారు. అనంతరం ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న వారికి ఆమె అభినందనలు తెలిపారు. అలాగే వృద్ధులకు న్యాయ సహాయం కోసం ఆశ్రమంలో న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

కంకర తేలిన రోడ్డు



కంకర తేలిన యాపట్ల రోడ్డు

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త, పాత యాపట్ల గ్రామాల ప్రజలు మారేడుమాన్‌దిన్నె, చంద్రబండతండా, వేడుకరావుపల్లి తండా గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై నుంచే మండల కేంద్రానికి చేరుకుంటారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో బీటీ రోడ్డు కొట్టుకుపోయి కంకర తేలింది. అచ్చంపేట, కొల్లాపూర్ ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మత్తులు చేసి బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా లీకవుతున్న మిషన్ భగీరథ తాగునీరు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపుర, పెద్దకార్పాములలలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంపీడీఓ కార్యాలయం పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుంది. దేవల్‌తిరుమలాపూర్‌కు తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్లు కేఎల్ఐ కాల్వ పక్కన లీకేజీతో నీరంతా రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్తున్నాయి. పెద్దకార్పాములలో ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీతో సీసీ రోడ్లపై పారుతోంది. ఈ పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల భారిన పడుతారన్నారు. లీకేజీలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.